క్లుప్తంగా

జంప్ రోప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

డోన్ టౌన్: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో అండర్ 14 విభాగంలో పట్టణంలోని శ్రీసుధ స్కూల్‌కు చెందిన పవన్, భరత్, రాజు సత్తాచాటి బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించినట్లు కరెస్పాండెంట్ వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మనోహర్, హరి, జానీలను బుధవారం అభినందించారు. నవంబర్‌లో బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు.

యువకుడిపై దాడి

• నలుగురిపై కేసు నమోదు



గాయపడిన మదార్‌వలి

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటకు చెందిన మదార్‌వలి(22)పై అదే కాలనీకి చెందిన నలుగురు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ ఇంతియాజ్ బాషా వివరాల మేరకు.. కొండపేటకు చెందిన మదార్‌వలి అదే కాలనీలో ఉంటున్న చిన్న కేశవులు ఇంటి ముందు మంగళవారం రాత్రి అటూ ఇటూ తిరుగుతుండగా ప్రశ్నించాడు. మాటమాట పెరిగి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో చిన్న కేశవులు, హరి, మౌలాలీ, రంగముని మదార్‌వలిపై దాడి చేశారు. తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. బుధవారం బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.


పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఆటోనగర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

డోన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. స్థానిక ఆటోనగర్, తారకరామనగర్ ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా స్వచ్ఛ భారత్ దివాస్‌ను ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లైట్లు వేయరు.. చీకటి తొలగదు



ఆకుమల్ల మొయిన్ బజార్‌లో వెలగని వీధిలైట్లు

సంజామల: ఆకుమల్ల గ్రామంలోని పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగక గ్రామస్తులు చీకటిలో మగ్గుతున్నాయి. గ్రామంలో సుమారు 4 నెలల నుంచి వీధిలైట్లు మరమ్మతుకు గురయ్యాయి. ప్రజలు ఎన్నిసార్లు మొత్తుకుంటున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షకాలంలో పాములు, విషపురుగులు తిరిగే అవకాశం ఎక్కువగా ఉందని.. చీకటిలో తిరగాలంటే భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జనజాగృతి సమావేశాన్ని జయప్రదం చేద్దాం

డోన్: కర్నూలు జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 22వ తేదీ జరిగే వాల్మీకి, బోయ కులస్తుల జన జాగృతి సదస్సుకు ఉమ్మడి జిల్లాలోని వాల్మీకి, బోయ కులస్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయుడు కోరారు. బుధవారం పట్టణంలోని వాల్మీకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఎస్టీ సాధనే ధ్యేయంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంఘం నాయకులు శ్రీరాములు, ఎర్రిస్వామి, శివ, విజయ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో చేకూరిన లబ్ధి



బనగానపల్లె నియోజకవర్గంలో..

రైతు భరోసా	42,005 మంది రైతులకు రూ. 31.50 కోట్లు సాయం
అమ్మఒడి	27,128 మంది తల్లులకు రూ. 27.128 కోట్ల ఆర్థిక సాయం

డోన్ నియోజకవర్గంలో..

రైతు భరోసా	37,337 మంది రైతులకు రూ.50.40 కోట్ల సాయం
అమ్మ ఒడి	28,575 తల్లులకు రూ.37.12 కోట్లు ఆర్థిక సాయం



బనగానపల్లెలో...

సూపర్ సిక్స్ పథకాల లబ్ధిదారుల వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందించాల్సిన మొత్తం
మహిళలకు ప్రతి నెలా రూ. 1500	86,726	రూ.13 కోట్లు
యువతకు రూ. 3వేలు నిరుద్యోగభృతి	71,672	రూ.21.50 కోట్లు
తల్లికి వందనం	29,128	రూ. 43.69 కోట్లు
ప్రతి ఇంటికి అన్నదాత సుఖీభవ	42,007	రూ. 84 కోట్లు

డోన్ నియోజకవర్గంలో...

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందించాల్సిన మొత్తం
మహిళలకు ప్రతి నెలా రూ. 1500	84,532	రూ.12.67 కోట్లు
యువతకు రూ. 3వేలు నిరుద్యోగభృతి	88,604	రూ.26.58కోట్లు
తల్లికి వందనం	28,575	రూ. 42.86కోట్లు
ప్రతి ఇంటికి అన్నదాత సుఖీభవ	37,337	రూ.74.67కోట్లు

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



కోవెలకుంట్ల మండలం వల్లంపాడు గ్రామానికి చెందిన దినకర్ పదో తరగతి, సౌజన్య డిగ్రీ వరకు చదివి ఇంటి వద్ద కిరాణాషాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నంద్యాలలోని ప్రైవేట్ పాఠశాలలో పెద్ద కుమారుడు 5వ తరగతి, చిన్న కుమారుడు 4వ తరగతి చదువుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 50 రోజులు దాటినా ఇప్పటి వరకు ఏ ఒక్క పథకం అమలు చేయలేదు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఆ కుటుంబానికి నిరుద్యోగ భృతి ద్వారా నెలకు రూ. 3వేలు, తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ. 15వేల చొప్పున రూ. 30వేలు, అన్నదాత సుఖీ భవ పథకం ద్వారా రూ. 20వేలు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు వర్తించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అందుతాయని ఆ కుటుంబం ఎదురుచూస్తోంది.

తల్లికి వందనం వచ్చేనా



నా పేరు భవాని. నాకు ఇద్దరు కుమార్తెలు. అవుకులోని ప్రైవేటు పాఠశాలలో ఒకరు 2వ తరగతి, ఇంకొకరు నర్సరీ చదువుతున్నారు. తల్లికి వందనం వస్తుందనే నా రెండో కుమార్తెను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాను. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా తల్లికి వందన పథకంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇంతకి తల్లికి వందనం వస్తుందా .. రాదా అని కూడా తెలియడం లేదు.

హామీలకు నో గ్యారెంటీ..!

సూపర్‌సిక్స్ హామీలతో పేదలను ధనవంతులుగా మార్చుతామని హామీలు గుప్పించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. రేపటి(శుక్రవారం)తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులవుతుంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయం రూ.20 వేలకు పెంచి ఖాతాల్లో జమచేస్తామని రైతులను నమ్మించారు. ఖరీఫ్ పోయి రబీ దగ్గర పడినా రైతులకు భరోసా దక్కలేదు. ఇంటిలో ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని, నిరుద్యోగులకు రూ.3వేల చొప్పున భృతి అందిస్తానని, తల్లికి వందనం పేరిట ఇంటిలో ఎంతమంది పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నా రూ.15 వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ఆశపెట్టారు. పాఠశాలలకు ప్రారంభమై మూడు గడిచినా ఆ ఊసే ఎత్తలేదు. అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేతలు, తదితర ఫించన్లను రూ. 3వేల నుంచి రూ. 4 వేలకు పెంపు మినహా మిగిలిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుండడంతో లబోదిబోమంటున్నారు. సూపర్‌సిక్స్ హామీలను నమ్మి ఓట్లు వేసిన జనం కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. -బనగానపల్లె/డోన్/కోవెలకుంట్ల

మెగా డీఎస్సీని త్వరితగతిన నిర్వహించాలి



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రమాణ స్వీకారం రోజున మెగా డీఎస్సీ నిర్వహణకు తొలి సంతకం చేశారు. నా భార్య ఎంఎస్సీ బీఈడీ, నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. మాకు ఇద్దరు కుమారులు సంతానం. ప్రస్తుతం పట్టణంలోని పెట్రోల్ బంకులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. జాప్యం చేయకుండా త్వరితగతిన డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి. -మహేష్, కోవెలకుంట్ల

ఆశగా ఎదురు చూస్తున్నాం



నా పేరు స్వప్న భాయి. మాది మారుమూల గ్రామమైన ఇస్రానాయక్ తండా. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా ఏడాదికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఏడో తరగతి చదువుతున్న నా కుమారుడిని బాగా చదివించుకోవచ్చని అనుకున్నా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతున్నా పథకం ఊసెత్తడం లేదు. ఆశగా ఎదురు చేస్తున్నాం. -స్వప్న భాయి, ఇస్రానాయక్‌తండా, అవుకు

సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి



ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి పెట్టుబడి సాయం అందించాలి. జగన్ అధికారంలో ఉన్న సమయంలో ఏటా మొదటి వారంలోనే పెట్టుబడి సాయం అందించేవారు. ఈ ప్రభుత్వంలో సాయం లభించడంలో జాప్యం జరుగుతుంది. పంటసాగు ప్రారంభం కావడంతో పెట్టుబడి కోసం వడ్డీలతో ఇతరుల నుంచి అప్పులు చేయాల్సి వస్తోంది. సకాలంలో అప్పులు లభించక ఇబ్బందులు పడుతున్నాం. -పి.వెంకటేశ్వర్లు, రైతు, కాపులపల్లె, బనగానపల్లె

గత ప్రభుత్వంలో ఈ పాటికే రైతు భరోసా వచ్చేది



నాకు 5 ఎకరాల పొలం ఉంది. ఈ ఏడాది వేరుశనగ సాగు చేశాను. పెట్టుబడికి ఇప్పటికే ఎకరాకు రూ. 40 వేలు చొప్పున ఖర్చయింది. గత ప్రభుత్వం రెండు విడతలుగా రూ. 13,500 చొప్పున క్రమం తప్పకుండా ఇచ్చింది. పంటల సాగు సమయంలో ఈ డబ్బులు రైతులకు ఎంతో ఉపయోగపడేవి. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇంత వరకు పెట్టుబడి సాయం గురించి చెప్పడం లేదు. ఎన్నికల్లో హామీ ఇచ్చారు కాబట్టి రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం వెంటనే అందించాలి. ఏ ప్రభుత్వమైన రైతులను మోసం చేయడం మంచిది కాదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. -కొండన్న, మామిళ్లపల్లి, ప్యాపిలి

2014 పరిస్థితులు కనిపిస్తున్నాయ్



గతంలో రైతు భరోసా, పొదుపు మహిళలకు పసుపు కుంకుమ లాంటి హామీలిచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఒక్కటి కూడా నెరవేర్చలేదు. అయితే సూపర్‌సిక్స్ పేరుతో ఆరు ఆకర్షణీయమైన పథకాలను అమలుచేస్తామని నమ్మించి తిరిగి 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. అయితే గత అనుభవాల భయం వెంటాడుతోంది. ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామనే హామీపై 100 రోజులైనా ప్రకటన చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఏరు దాటకముందు వెంకన్న ఏరు దాటాక పింగన్న అనే విధంగా కాకుండా ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి. -పద్మావతి, గృహిణి, కొత్తపేట, డోన్

నిరుద్యోగ భృతి ఏదీ?



నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో గత ప్రభుత్వంపై అసంతృప్తితో టీడీపీ కూటమికి అండగా నిలిచారు. అయితే గతంలో ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నమ్మించి కొంతకాలం మాత్రమే భృతి చెల్లించి చంద్రబాబు మోసం చేసిన సంగతిని ఇంకా మరిచిపోలేకున్నాం. ఈసారి ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే నిరుద్యోగులు ఉద్యమం చేపట్టి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు. -ఉదయ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

టీడీపీ నేతల ప్రచారం ఇలా

సూపర్ సిక్స్ అమలుచేసి తీరుతాం



'రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలుచేసి తీరుతాం'. బాబు షూరిటీ .. భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ 2024 ఏప్రిల్‌లో 6వ తేదీ డోన్ నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రచారం. – టీడీపీ అధినేత చంద్రబాబు (ఫైల్)

మహిళలకు ఆర్థిక భరోసా



'రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.1500 ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది'. డోన్ ఎన్నికల ప్రచార సభలో నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి. – బైరెడ్డి శబరి (ఫైల్)

ప్రతి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం



'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.13,500 నుంచి రూ.20 వేలకు రైతు భరోసా మొత్తాన్ని పెంచి అందజేస్తాం'. డోన్ నియోజకవర్గ ఎన్నికల ప్రచార సభలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికోట్ల సూర్యప్రకాష్ రెడ్డి. – కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి (ఫైల్)

భక్తిశ్రద్ధలతో జ్యోతుల మహోత్సవం





జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేకఅలంకరణలో అమ్మవారు.

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం జ్యోతుల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు 30 జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి చౌడేశ్వరీదేవి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జ్యోతుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఏటీఎం కార్డు మార్చేసి నగదు కాజేసి..





బాధితుడు పెద్దయ్య

దొంగలు ఇచ్చిన ఏటీఎం కార్డు

డోన్ టౌన్: ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసే క్రమంలో కార్డు మార్చివేసి నగదు చోరీ చేసిన ఘటన బుధవారం డోన్‌లో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. పట్టణానికి చెందిన రిటైర్డు ఉద్యోగి (విద్యుత్‌శాఖ జేఏట) వై.పెద్దయ్య బుధవారం సాయంత్రం ప్రధాన స్టేట్ బ్యాంక్ ఏటీఎంకు వెళ్లారు. అక్కడున్న ఇద్దరు వ్యక్తులు నగదు విత్‌డ్రా చేసేందుకు సహాయపడేలా నటిస్తూ ఆయన కార్డును తీసుకుని వేరేకార్డును చేతికిచ్చారు. పెద్దయ్యకు ఇచ్చిన కార్డు పెట్టి డబ్బులు డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా పనిచేయలేదు. తిరిగి చూసే లోపు ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా దుండగులు బాధితుడి కార్డుతో అదే ఏటీఎంలో రూ.20 వేలు డ్రా చేశారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాకు ఫిర్యాదు చేయగా ఆయన వెంటనే కానిస్టేబుళ్లను పంపించి గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. సాయంత్రం 4 గంటలకే ఠంచనుగా బ్యాంకు సిబ్బంది షట్టర్ మూసివేయడంతో ఫిర్యాదు చేసేందుకు అవకాశం లేకుండా పోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాల వనరులు



మాట్లాడుతున్న జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇటిక్యాల ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల వనరులు ఉన్నాయని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో అసిస్టెంట్ జోనల్ మేనేజర్ మాధవిలతతో కలిసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 2018లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇటిక్యాల ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేశామన్నారు. 59 ఎకరాల ప్రభుత్వ భూమిలో విశాలమైన రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సదుపాయం కల్పించామన్నారు. పార్కులో మొత్తం 266 ప్లాట్లు ఉండగా ఐదు ప్లాట్లు మాత్రమే పారిశ్రామిక వేత్తలు తీసుకున్నారన్నారు. సూక్ష్మ,మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇక్కడ మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సెంటు రూ.26వేలుగా నిర్ణయించామన్నారు. ఒక ప్లాటుకు ఏడున్నర సెంట్లు కేటాయించామని వీటికి రూ.2 లక్షలు ధర ఉంచామని తెలిపారు. ప్లాట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండేళ్లలోపు పారిశ్రామికవేత్తలు యూనిట్‌ను ప్రారంభించాల్సి ఉంటుందని చెప్పారు. సేల్ లీడ్‌లోకి వెళ్లిన తర్వాతనే భూమిపై సర్వహక్కులు యజమానికి వర్తిస్తాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 రీబెట్ ఉంటుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి, ఏపీఓ గంగన్న పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సంజామల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన వారు ధరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి అన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 24న డెమో నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. మరింత సమాచారం కోసం సంజామల ప్రభుత్వ కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి

కోవెలకుంట్ల: గత విద్యా సంవత్సరం వేసవి సెలవుల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. 2024 మే నెలలో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించుట, టీసీలు, స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వడం, తదితర పనులకు విధులు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయులకు దామాషా పద్ధతిలో ఆర్జిత సెలవులు ఇవ్వాలని కోరారు.

మద్యం విక్రేత అరెస్ట్

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం గ్రామంలో సురబోయిన నాగసుబ్బరాయుడు మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. అతని వద్ద 15 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

బనగానపల్లె రూరల్: రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరాంతర పోరాటం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్ అన్నారు. బుధవారం బనగానపల్లెలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ధనుంజయ్ మాట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఏఐఎస్ఎఫ్‌లో చేరాలని కోరారు. సంఘం జిల్లా కోశాధికారి సురేష్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు



డోన్: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న పోడియాన్ని బుధవారం తొలగించారు. సబ్‌రిజిస్ట్రార్లు ఎత్తున ఉండే పోడియంపై కాకుండా ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహించేలా ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు పోడియాన్ని తొలగించినట్లు సబ్‌రిజిస్ట్రార్ బజారి తెలిపారు.

జనరల్ స్టోర్‌లో చోరీ

• రూ.35 వేలు అపహరణ

కోవెలకుంట్ల: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న రాందేవ్ జనరల్ స్టోర్‌లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఇనుప రాడ్డుతో షెట్టర్‌కు వేసిన తాళం పగులగొట్టి షాపులో ఉంచిన రూ. 35 వేలు అపహరించాడు. షాపుకు అనుసంధానంగానే యజమాని ఇల్లు ఉన్నా ఎలాంటి శబ్దం రాకుండా తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించడం గమనార్హం. అర్ధరాత్రి సమయంలో ఓ యువకుడు ఇనుప రాడ్‌తో వెళుతున్నట్లు మెయిన్‌రోడ్డులో అమర్చిన సీసీ కెమెరాల్లో నమోదైంది. పోలీసులు సీసీకెమెరా పుటేజీ ఆధారంగా దొంగను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత నెలలో పాండురంగ స్వామి దేవాలయ సమీపంలోని కిరాణ దుకాణంలో చోరీ, మూడు రోజుల క్రితం పట్టణ శివారులోని సాయిబాబా గుడిలో హుండీ కానుకల చోరీ..తాజాగా మరో ఘటన స్థానికులను కలవరపరుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు



పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సరళ, ఎంపీడీఓ

కోవెలకుంట్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్వచ్ఛతాహిసేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ముదిగేడు చౌరస్తా నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరుగు పందెం పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. దోమలు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్‌డీ రాధిక, ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి, కృష్ణదాసు, రాజశేఖర్, సంటి రెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాణ్యం ఫ్యాక్టరీపై అసత్య ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

బేతంచెర్ల: మండల పరిధిలోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీపై టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని ఫ్యాక్టరీ కార్మికులు పీఎస్ మహబుబ్ బాషా, మహేష్, నాగ మద్దయ్య, కంబయ్య, గ్రామస్తుడు యాకోబ్ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు 20 ఏళ్లగా పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా నాయకులు పట్టించుకోలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఫ్యాక్టరీ ప్రారంభించగా ప్రత్యక్షంగా 550 మంది కార్మికులు, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి లభించిందని తెలిపారు. అయితే టీడీపీ నాయకులు మంత్రి, ఆయన కుమారుడిపై అసత్య ఆరోపణలు చేయడం భావ్యం కాదని.. వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు.

పశువుల ఆరోగ్యానికి టీకా రక్ష



పాడిరైతులకు సూచనలిస్తున్న ఏడీ మారుతీ

అవుకు: పశువుల్లో సోకే వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ మారుతీ సకారం అన్నారు. బుధవారం అవుకు మండల పరిధిలోని కొండమనాయునిపల్లె, మారేమడుగుల గ్రామాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందని, దీని వల్ల పాడి రైతు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఈ వ్యాధిని నివారించాలంటే గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. అలాగే జీవాల్లో పారుడు రోగం రాకుండా ముందస్తు జాగ్రత్తగా జీవాల పెంపకందారులకు పీపీఆర్ వ్యాక్సిన్ అందజేశారు. పశుపోషకులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి, రామ్‌కుమార్ రెడ్డి, ఎల్ఎస్ఏ రాజేష్, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.